# "ఉత్తరకుమారి" ఓటమి

"హిమబిందు"

పాలయలుకల్ వహించి వలపుల్ మొలిపించు
పిసాళి గబ్బిగు
బ్బల జవరాండ్ర మైగగురుపాటు నేటికి
వచ్చెనమ్మ! తా
విలువని పేరటంబనుచు బెగ్గిలి నాథుల
గౌగలింపగా
బొలుపుగనందు బెండ్లినడుపుల్ నడపున్
వలినాలి కెమ్మెరల్.

తెలుగు లెక్చరర్ తెలుగు క్లాసులో విద్యార్థినులకు విజయ విలాసములోని ప్రథమాశ్వాసములో పదమూడవ పద్యం చదివి అర్థం చెపుతున్నది.

"ఆ పట్టణములో (ఇంద్రప్రస్థ పురములో) వలపుకలహాముల చే భర్తలపై కోపించిన భార్యలు భర్తల అనునయమునకు శాంతింపకపోగా, వారి బింకము సాగనీయక భర్తలకు లొంగజేయునట్లు మలయమారుతము వీచగనే ఆ యువతుల పట్టుదల సడలినది. అప్పుడా స్త్రీలు..." ఇంతలో సందేహాలు పుట్టయొక కొంటె కమలకు సందేహము పుట్టుకొచ్చింది. "అదెలాగండీ! కోపించుకొన్నవారు వెంటనే ఒక పిల్ల వాయువు వల్ల లొంగిపోతారంటున్నారు! అది ఎంతమాత్రం వీలుపడదనుకొంటానండి!" అని వెంటనే ప్రొటెస్టు చేసింది. అప్పుడావిడ "లేదమ్మాయి, నీకు తెలియదు. అనుభవంలో కాని ఇలాంటివి అర్థం కావులే!" అని నవ్వారు. క్లాసంతా గొల్లుమన్నారు. కమల ప్రక్కన ఉన్న ప్రమీల ఊరుకోక "రేపు మాద్దాంలే నీ పెళ్ళయాక!" అంది మెల్లిగా. కమలకు కోపం వచ్చి గిల్లింది. ప్రమీల కిలకిల నవ్వింది. ఇంతలో లెక్చరర్ "ఏమిటా గోల? పాఠాలు సరిగా వినకుండా మీరు అధికప్రసంగము చేస్తున్నారు. ఇట్లా చేస్తే మీరే చెడుపుకొండి!" అన్నది, లేని కోపం నటిస్తూ లోలోపల వీరిగోలకు తనూ నవ్వుకుని. క్లాసంతా సద్దుమణిగాక, మళ్ళీ పాఠముతో ప్రొసీడ్ అయ్యారు కాని కమల సందేహ నివృత్తి చేసేవారు లేరు. తనమటుకు తాను మాత్రం కోపం వస్తే పిడుగుపడ్డా ఎదురు పార్టీవారితో (అంటే కలహించిన వారితో) మాట్లాడదు అనే అనుకొంది. ఇట్లా ఆలోచన లనెడి అలలచే అల్లకల్లోలినిలో మునిగియున్న కమల తర్వాత యింకొక పద్యం చెపుతున్నారన్నది అసలే వినిపించుకోలేదు. లెక్చరర్ గారి గదమాయింపుతో తను క్లాసులోవున్న సంగతి కమలకు తెలిసింది. "ఏమిటి కమలా ఆ దీర్ఘాలోచన! నేనిప్పుడేం చెప్పాను చెప్పు!" అన్నారు కోపంతో. కమల చెప్పలేకపోయింది. ఇంతలో గంట కొట్టారు. తర్వాత లెక్చరర్ కోపంతో "ఇకమీదట పాఠాలు శ్రద్ధగా విను, వినకపోయావో, మార్కులు తగ్గిపోతాయిసుమా! తెలుగే కదా అని అశ్రద్ధగా ఉండకూడదు. ఈ తెలుగుపిల్లలకంతా ఇదే దుర్బుద్ధి మన తెలుగే కదా మనకురాకుండా పోతుందా అనుకుంటారు. కాస్త ఒళ్లు దగ్గరపెట్టుకొని చదువు! నువ్వు శ్రద్ధ పెట్టకపోయావా నీకే నష్టం జాగ్రత్త!" అని వెళ్ళిపోయారు.

కథానిక

కాని ఆ నాడంతా కమలకు సందేహం వదల్లేదు. పాఠాలు శ్రద్ధగా వినలేదు. సాయంత్రం ఆటలకై పిల్లలందరూ వెళ్ళారు. ప్రమీల కమలదగ్గరకి వచ్చి "ఏమిటమ్మా ఆ దీర్ఘాలోచన! ఆటలుగూడా సరిగా ఆడటంలేదు. నాకు చెప్పకూడదటిదా? చెప్తే ఆ వార్త సంతోషమైనదైతే నేను సంతోషిస్తా, దుఃఖమైనదైతే నేనూ నీ దుఃఖాన్ని పంచుకుంటా" అంది. కమల నవ్వుతూ, "సందేహాస్పదమైన సమస్య. తెల్లవారి క్లాసులో విన్నావు గదా! కోపించుకొన్న స్త్రీ ఒక చిన్న గాలి వలన భర్తకు లొంగి పోయిందంటే హాస్యాస్పదంగా ఉంది. స్త్రీల గురించి ఇంత చులకనగా వ్రాయడం నాకు నచ్చలేదు సరిగదా, నా మట్టుకు నేనైతే పిడుగు పడ్డా మాట్లాడను సుమా!" అంది. ప్రమీల నవ్వుతూ "ఏమో చూద్దాంలేవే! నీ అనుభవంలో ఎప్పుడైనా అలాంటి సంఘటనలు జరుగకపోవు. అప్పుడు మాత్రం నేనెక్కడ ఉన్నా నాకొక

ఉత్తరం ముక్క పడవేయడం మరచిపోకేం!" అన్నది చిలిపిగా. కమల "పోవే నీకన్నీ తమాషాలే!" అంది.

* * *

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కమల రామం అనే అందగాడైన డాక్టరును పెళ్ళాడి మద్రాసులోనే ఉంది. ప్రమీల మాత్రం పెళ్ళి చేసుకొని గుంటూరులో తన భర్త ప్రాక్టీసు పెట్టగా ఆ వూరు వెళ్ళిపోయింది. ఇద్దరూ తరచు ఉత్తరాలు వ్రాసుకొనేవారు. ఒక్కొక్క ఉత్తరంలో ప్రమీల తెలుగు క్లాసు పద్యం జ్ఞాపకం చేసేది. కాని కమలమాత్రం "నా అనుభవంలో అది ఎన్నటికీ జరుగద"నేది. కమలకి కోపం ముక్కుమీద ఉంటుంది. కాని రామం సర్దుకుపోయేవాడు కాబట్టి ఆమెమీద అతడు కోపగించుకొని ఎరుగడు.

ఒక రోజు రామం కాస్త చిరాకుగా ఇంటికి వచ్చాడు; హాస్పిటల్లో పని ఎక్కువగా ఉండడం వల్ల కాస్త విసుగ్గా ఉన్నాడు. కమల వంటగదిలో పని తొందరలో ఉంది. "కమలా నా షర్టేదీ?" అన్నాడు. అసలే చిరాగ్గా ఉన్న కమలకు కోపం వచ్చింది: "అబ్బా! ప్రతిరోజూ మీ షర్టులూ మీ కోట్లూ, మీ పాంట్లూ చూసుకొనే పనేనా నాకు, ఇంకేదైనా ఉందా? అంతమాత్రం ఉన్నది ఉన్నచోట ఉంచరు. ఎక్కడంటే అక్కడ పడేసి నా ప్రాణాలు తోడేస్తున్నారు. పోయి ఎక్కడ పెట్టారో అక్కడే వెదకండి" అంది మహా చిరాకుగా. అసలే అలిసియున్న రామానికి కోపం ఇంకా రెచ్చిపోయి "చాల్లే మహా ఉత్తమురాలవులే! ఇల్లంతా చక్కగా చూసుకునే ఇల్లాలిలాగ పేలుడు మొదలెట్టావు! అమ్మో! ఈ చదువుకొన్న ఆడవాళ్ళను పెళ్లాడితే వచ్చే తంటాలే ఇవన్నీ. తీరిక సమయం దొరికితే చాలు ఇల్లు చక్కబెట్టుకోక పుస్తకాలు, పత్రికలు, నవలలు ఇంకా ఇంకా ఏవో ముందు పెట్టుకొని చదువుతూ ఉంటారు. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ పోయిందీ తెలియదు. ఊఁ అంటే కోపం ఊహుఁ అంటే కోపం. చదువుకున్న వాళ్ళం గదా అని కళ్లు నెత్తికెక్కి ఎదిరిస్తారు ఛీ!" అని స్త్రీవిద్య మంచిదా చెడ్డదా అని ఉపన్యాసాలలో వాద ప్రతివాదాలు చేసేటప్పుడు ప్రతివాదిలా మాట్లాడాడు. కమల కూడా తక్కువది కాదు. వెంటనే "నన్ను పెళ్ళాడేటప్పుడు మీ కళ్లెక్కడ పెట్టుకొన్నారు? వెదకివెదకి మీ అర్థంలేని పిచ్చి కూతలకు హడలిపోయే అడవి మృగంలాంటి చదువుకోని ఉత్తమ ఇల్లాలిని చేసుకోలేకపోయారా?" అని చెంపమీద కొట్టినట్లు అనేసింది. వెంటనే రామం ఏమీ మాట్లాడలేక ఏదో షర్టు తీసి వేసుకొని పార్కువైపు నడిచాడు. తనవంటి భార్యా విధేయులకు, అనాధులకూ ఆశ్రయాన్నిచ్చే ఆ అమరవనానికి వెళ్ళాడు.

ఇంక అక్కడ కమలేమో, రామం క్షమాపణ చెప్పుకునేదాకా మాటాడకూడదని నిశ్చయించుకుంది. తెలుగు క్లాసులోని ప్రతిజ్ఞ జ్ఞాపకము చేసుకొని తన నిశ్చయాన్ని మార్చుకోదలుచుకోలేదు. రామంకూడా పట్టుదలతో ఉన్నాడు. ఆ రాత్రి రామం పదకొండింటికి ఇంటికి వచ్చాడు. ఏమీ పలుక్కుండా తన మంచంమీద శరీరాన్ని వాల్చాడు. అంతే, బాగా నిద్రపట్టింది. కమల ఏమి పలుక్కుండా మౌనంగా వంటగది తాళంవేసి పడకగది ముందు చాప పరుచుకొని పడుకొంది. నిద్ర రావటంలేదు; వీధితలుపు గడియ పెట్టడం మరచిపోయింది. ఏదేదో యోచిస్తూ ఉండగా తెలుగు క్లాసు జ్ఞాపకం వచ్చింది. ఇంతలో ఏదో భయంగా ఉంది. తనెప్పుడూ ఒంటరిగా పడుకొని ఎరుగదు; చిన్నప్పుడు తల్లి సంటిపెట్టుకు పడుకునేది. తర్వాత భర్తను ఒదిలి ఒంటరిగా పడుకొని ఎరుగదు. మెల్లగా గదిలోపోయి పడుకొందామనుకొంది. కాని స్వాభిమానం అడ్డంవచ్చింది. చింత చచ్చినా పులుపు చావదన్నట్లు కమల పౌరుషం వదల్లేదు. ఇంతలో వీధిదగ్గర అడుగుల చప్పుడైంది. ఇంకేముంది దొంగే! అంతే, కమల గజగజ వణికిపోతూ భర్త మంచందగ్గరకిపోయి "ఏమండోయ్! దొంగ, దొంగ!" అని రామాన్ని గట్టిగా పట్టుకొంది. రామం దిగ్గునలేచి "కమలా నన్ను వదలు, నేపోయి చూసివస్తా" నన్నాడు. కమల తన పట్టు వదలకుండా "వద్దండి బాబోయ్! నాకెందుకో మహా భయంగా ఉంది, ఇక్కడే ఉండండి!" అని బతిమాలుకుంటోంది. ఇంతలో చుట్టుప్రక్కల యిళ్ళలోని వాళ్ళు యీ అలికిడికి మేల్కొని అందరూ కలిసి ఎలాగైతేనేం 'దొంగ'ను పట్టుకున్నారు. వాడు "అయ్యా నే పాలవాడి

నండీ. అమ్మగారికి పాలుపోసే వాడిని! అయ్యగారు రోజూ నాలుగ్గంటలకి తలుపు తెరిచి పాలు తీసుకొనేవారు. ఇవాళేమో అమ్మగారలా ఎందుకో భయపడ్డారు!" అని వాడు మొత్తుకొన్నాడు. అప్పటికి కమలకు తెల్లవారి నాలుగు గంటలైందని తెలిసింది. ఎప్పుడూ పాల రంగన్న నాలుగ్గంటలకు పాలు తెస్తే తను లేచేముందే రామం వాటిని గిన్నెలో పోయించుకునేవాడు. కమల సిగ్గుపడి పోయింది. రామం బొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు. అందరూ నవ్వుకున్నారు.

ఆ మర్నాడు కమల కాగితం కలం తీసి ప్రమీలకు ఉత్తరం వ్రాస్తూ, తెలుగుక్లాసు ప్రతిజ్ఞలో తాను ఓడిపోయిందని వ్రాస్తోంది. రామం ఆదివారం కాబట్టి ఇంట్లోనే ఉన్నాడు. దొంగ కృష్ణుడులా కమల వెనుకనుంచి రామం ఉత్తరం అంతా చదివి గట్టిగా—

పొలయలుకల్ వహించి వలపుల్ మొలిపించు
పిసాళిగబ్బి గు
బ్బల జవరాండ్ర మైగగురుపాటున నేటికి
వచ్చెనమ్మ తా
బిలువని పేరటంబనుచు బెగ్గిలి నాథుల
కౌగలింపగా
బొలుపుగ నందు పెండ్లి నడుపుల్ నడుపున్
చోరు నాగమనపుల్!

అని కడపటి పదాన్ని గట్టిగా నొక్కి పలికాడు. తాను ఓడిపోయినందుకు సంతోషంతో కమల కిలకిలా నవ్వింది హాయిగా.

---

స్కెచ్

# పడమటి కొండలు

యేర్లగడ్డ శివరామకృష్ణ

గూట్లో కోడిపుంజు నిద్రమేలుకుంది. బయటకు దృష్టి సారించింది. బలంగా చలిగాలీ — హోరుగా వానా; కూర్దామనుకున్న కోడిపుంజు బద్ధకించి రెక్కలు యింకా ముడుచుకుని గూటి మూలకు చేరి పడుకున్నది.

ఆ పట్టణం అర్ధయామున నిద్రపోతోంది. వానా చలిగాలీ... వెచ్చగా హాయిగా నిద్రపోతోంది. ఆ 'వెచ్చగా' 'హాయిగా' అనేవి మేడల్లోనూ, మంచి వసతైన చోటుల్లోనూ పేరుకుపోయాయి. ధర్మసత్రాలూ, రైలుస్టేషను హాల్లూ, ఇళ్ళపంచలూ, జీర్ణమైన యిళ్ళూ గజగజా వొణికిపోతూనే వున్నాయి. ఇటువంటి స్థలాల్లో ఉండటానికి భయం కలిగి 'వెచ్చదనమూ' 'హాయీ' మేడల్లోనూ వసతైన చోట్లల్లోనూ తల దాచుకున్నాయి.

ఆ సమయాన ఊరుకు చివర గజగజా వొణికిపోతోన్న పూరింట్లోంచి బాధాకరంగా మూలుగు వినిపిస్తోంది. ఆ గదిలోనుంచే ఆ మూలుగుకి అనునయ స్వరాలుగూడా వినిపిస్తున్నవి.

మూలుగు వొక్కసారి పెద్దదైంది. "అమ్మా! అబ్బా" అంటూ. ఆ తరువాత "క్యార్! క్యార్!" అంటూ పసిగొంతు యేడ్పు వినిపించింది. ఆ శబ్దానికి గదవతల కుక్కి మంచంలో జారగిలబడి పలవరిస్తూ నిద్రపోతోన్న ఓ ఆకారం ఉలిక్కిపడి లేచి కూచుంది.

అటూ యిటూ కలయజూసింది. ఆ మంచానికి అటూ యిటూ నేలమీద చిన్నా పెద్దా సైజుల్లో పదమూడు ఆకారాలు డొక్కల్లో కాళ్లుపెట్టుకుని అటూ యిటూ మసలుతూ నిద్రపోతున్నాయి.

కుక్కి మంచంలో లేచి కూచున్న ఆకారం క్రిందపడుకున్న ఆకారాలవంక చూసి మళ్ళీ గది వైపుచూసి "పద్నాలుగు" అని పెద్దగా అని తల మీద చెయ్యివేసుకుంది.

ఇంతలో గదిలోనుంచి ఓ కంఠం బిగ్గరగా "ఏవయ్యోయ్! నీనిద్ర పాడుగాను! పోయిందయ్యా పెద్దప్రాణం. ఇదిగో యీ రాక్షసి పుట్టి, నీ మనిషి పొట్టను బెట్టుకుంది" అని అరిచింది.

కుక్కిమంచంలోని ఆకారం ఉలిక్కిపడి లేచి